గాల్లో దీపంలా ప్రాణాలు

- హైవేకు కూతవేటు దూరంలో కోవూరుపల్లి పీహెచ్‌సీ
- అన్ని వసతులు ఉన్నా స్థాయి పెంపుపై అధికారుల ఉదాసీనత
- ప్రథమ చికిత్సకే పరిమితం..
- క్షతగాత్రులు, రోగులకు అందని అత్యవసర వైద్యసేవలు

• బోగోలు మండలం అల్లిమడుగుసంఘానికి చెందిన శంకర్ ఈ నెల 2న రాత్రి వేళ ఇంట్లోనే పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు లేరని కావలికి తీసుకెళ్లాలని వైద్యసిబ్బంది సూచించారు. వెంటనే కావలికి తరలించినా అప్పటికే ఆలస్యం కావడంతో శంకర్ ప్రాణాలు కోల్పోయాడు. సరైన సమయంలో చికిత్స అంది ఉంటే శంకర్ ప్రాణాలు నిలిచేవి.

• బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థినికి ఈ నెల 22న రాత్రి ఏడు గంటల సమయంలో పురుగు కుట్టింది. విద్యార్థిని అస్వస్థతకు గురవగా గురుకుల సిబ్బంది వెంటనే సమీపంలోని కోవూరుపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్యసిబ్బంది డాక్టర్లు అందుబాటులో లేరని ప్రథమ చికిత్స చేసి కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వసతిగృహ సిబ్బంది ఉరుకులు పరుగుల మీద విద్యార్థినిని కావలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు బాలికను కుట్టిన పురుగు విషపూరితం కాకపోవడంతో ప్రమాదం తప్పింది.


బిట్రగుంట: కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. పీహెచ్‌సీకి అన్ని సదుపాయాలతో కూడిన భవనం, ల్యాబ్, ఇతర వసతులు ఉన్నాయి. అయినా పీహెచ్‌సీ స్థాయిని పెంచకపోవడంతో కేవలం ప్రథమ చికిత్సకే పరిమితమైంది. అత్యవసర కేసులు వస్తే కావలికి రెఫర్ చేయడం మినహా ఏం చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఆరు పడకలతో హైవేకు కూతవేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీని 20 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి సీహెచ్‌సీగా స్థాయిని పెంచే ప్రతిపాదనలు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో బీపీ, షుగర్, జలుబు, జ్వరం వంటి సాధారణ వ్యాధులు మందులు ఇవ్వడం తప్ప పేదలు, రోడ్డు, రైలు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసరమైన వైద్యసేవలు అందడం లేదు. పీహెచ్‌సీకి రోజుకు 60 నుంచి 80 మంది వరకు రోగులు వస్తున్నా నాణ్యమైన వైద్యం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు ఉండగా, ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఒకరిని 104 వాహన వైద్యసేవలకు కేటాయించారు. మిగిలిన ఇద్దరు వైద్యులు మాత్రమే ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారు. ఒక్కోసారి ఇద్దరు డాక్టర్లు 104 సేవలకు వెళుతుండడంతో ఆస్పత్రిలో ఒక్కరు మాత్రమే సేవలందించే పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రి వేళల్లో స్టాఫ్‌నర్స్ మాత్రమే విధులు నిర్వహిస్తోంది. దీంతో పాముకాటు, తేలుకాటు, ఇతర అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే వారిని విధిలేని పరిస్థితుల్లో కావలి ఏరియా వైద్యశాలకు రెఫర్ చేయాల్సి వస్తోంది. దీంతో సమయాభావం కారణంగా బాధితుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అభివృద్ధి చేస్తే రాత్రి వేళల్లో కూడా డాక్టర్లు అందుబాటులో ఉంచితే అత్యవసర కేసుల్లో వెంటనే వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది.

రాత్రి వేళల్లోనూ సేవలందిస్తున్నాం



పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రాత్రి వేళల్లో స్టాఫ్‌నర్స్ అందుబాటులో ఉంటారు. 'ఆన్ కాల్ డ్యూటీ' పద్ధతిలో డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటున్నారు. ఎమర్జెన్సీ కేసులు వస్తే స్టాఫ్‌నర్స్ ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వెంటనే తగిన చికిత్స సూచిస్తున్నాం. అత్యవసరం అనిపిస్తే వెంటనే కావలి ఏరియా వైద్యశాలకు రెఫర్ చేసి నేరుగా అక్కడికే వెళుతున్నాం. ఆస్పత్రిలో పాముకాటుకు అవసరమైన యాంటీవీనమ్ నుంచి అన్నీ రకాల మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోవూరుపల్లి పీహెచ్‌సీ

ఉన్నతాధికారుల్లో ఉదాసీనత

కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హైవేకు కూతవేటు దూరంలోనే ఉంటుంది. రోడ్డు, రైలు ప్రమాదాల్లో గాయపడిన క్షతగ్రాతులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించే అవకాశం ఉండడంతో సీహెచ్‌సీగా అభివృద్ధి చేసి 24 గంటలూ వైద్యసేవలందించాలని రూపొందించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా అమలుకు నోచుకోవడం లేదు. నిబంధనల ప్రకారం పీహెచ్‌సీల్లో అత్యవసర వైద్యసేవలు చేసే అవకాశం లేకపోవడంతో కళ్ల ముందే రోగి పరిస్థితి విషమిస్తున్నా ఏం చేయలేని దుస్థితి నెలకొంటుంది. కోవూరుపల్లి నుంచి కావలి ఏరియా ఆస్పత్రికి తరలించాలంటే కనీసం 20 నుంచి 30 నిమిషాలకు పైగా సమయం పడుతుంది. అత్యవసర కేసుల్లో ఐదు నిమిషాల సమయం కూడా కీలకం. ఈ క్రమంలో కోవూరుపల్లి నుంచి కావలికి వెళ్లేలోపే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సందడి



ఆత్మకూరు: ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా శుక్రవారం విడుదల చేసిన సందర్భంగా అభిమానులు సందడి చేశారు. పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ నుంచి చిత్రం ప్రదర్శిస్తున్న థియేటర్ వరకు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమాని ఎస్ఆర్ఐ మీరామొహిద్దీన్ ఆధ్వర్యంలో దేవర సినిమా పేరుతో ముద్రించిన టీషర్టులను పంపిణీ చేశారు. అభిమానులు నవీన్, తారక్, అరాఫత్, ముజ్జు, వెంకి, సమి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు/కలిగిరి: తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు చేసిన పాప ప్రక్షాళన కోసం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని జేఆర్‌పేటలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. అలాగే కలిగిరిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

డెంగీపై అవగాహన



జలదంకి: బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జయలలిత ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. జలదంకి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్ దోమలతో వ్యాపించే డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు రమణయ్య, వజ్రమ్మ, ఆశా కార్యకర్తలు శ్రీదేవి, రమణమ్మ పాల్గొన్నారు.

బాణసంచా గోదాము తనిఖీ

చేజర్ల: ఆదూరుపల్లిలోని బాణసంచా గోదామును సంగం సీఐ వేమారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. బాణసంచా గోదాము వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానికి సూచించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు నూతన సబ్ రిజిస్ట్రార్‌గా వెరిచర్ల కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అహ్మద్ బాషా గూడూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరులో సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు వింజమూరుకు వచ్చారు. కాగా జూనియర్ అసిస్టెంట్‌గా జయకృష్ణ, అటెండర్‌గా కరీముల్లా చేరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చేజర్ల: సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు సైబర్ నేరాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్న నేరాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తుంటే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శైలజ, వైస్‌ప్రిన్సిపల్ నాగలలిత పాల్గొన్నారు.

ఎస్సైకు సన్మానం



మర్రిపాడు: మండల నూతన ఎస్సై శ్రీనివాసరావును ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైను శాలువాతో సత్కరించి మండలంలోని సమస్యలను విన్నవించారు. జిల్లా ఎంఎంఎస్ ఉపాధ్యక్షురాలు వడ్లపల్లి రమణమ్మమాదిగ, సీనియర్ నాయకులు ఆదినారాయణమాదిగ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఎస్ అంకయ్యమాదిగ, మంద నరేంద్ర మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మన ఇల్లు-మన గౌరవం

సీతారామపురం: మండలంలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి 9 సచివాలయాలకు 9 మంది ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. ప్రత్యేకాధికారులు హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశమై సొంతింటి కల సాకారంపై అవగాహన కల్పించి కార్యక్రమ విజయవంతానికి కృషిచేయాలన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



ఆత్మకూరు: మండలంలోని పడకండ్లకు చెందిన వృద్ధుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులకు ఆత్మకూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సూరం మాలకొండారెడ్డి గురువారం చేజర్లలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు ఆత్మకూరు బస్సు ఎక్కాడు. ఆత్మకూరుకు చేరుకున్న ఆయన గ్రామానికి వెళ్లలేదు. బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 91775 79429 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



మర్రిపాడు: మండలంలోని కుంటనీళ్లపాడు పాఠశాల హెచ్ఎం యలగాల శ్రీనివాసులు, పడమటినాయుడుపల్లి బీసీ కాలనీ పాఠశాల హెచ్ఎం షాహీనబేగాన్ని కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పడమటినాయుడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న శ్రీనివాసులు, షాహీనబేగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం రవి, చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, ఎమ్మార్పీ రాజేంద్రకుమార్, కదిరినాయుడుపల్లి స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరి విజయభాస్కర్‌రెడ్డి, చుంచులూరు ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు డీవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే జలమయం


రెండోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్డుపై నిల్వ చేరిన నీరు

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని బస్టాండ్ సెంటర్ చినుకుపడితే జలమయమవుతోంది. ఇక్కడ సైడు డ్రెయిన్లు లేవు. చిన్నపాటి వర్షం పడినా సిమెంట్ రోడ్డుపై నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనచోదకులతో పాటు పాదచారులు రాపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాహనాలు వెళ్లే క్రమంలో వర్షపు నీరు ఎగిరి పడుతుండడంతో దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్య నెలకొని ఉన్నా పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ఉదయగిరి: గర్భిణులకు సామూహిక సీమంతం

ఉదయగిరి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ సీడీపీఓ పచ్చవ లావణ్య పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ అతిథి గృహ ఆవరణలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యం పోషకాహారంపై ఆధారపడి ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, సూపర్‌వైజర్లు తేజస్విని, షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అల్లూరులో..

మర్రిపాడు: డీసీపల్లి సెక్టార్ పరిధిలోని పొంగూరుకండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ ఎం పద్మావతి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతను అధిగమించేందుకు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. డీసీపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అల్లూరు: పోషకాహారంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని సూపర్‌వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. అల్లూరుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవ



ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు ఉన్నత పాఠశాలలో అభ్యుదయ మహిళా మండలి ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు జే జయలక్ష్మి ఆధ్వర్యంలో సభ్యులు పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎం నరసింహులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



సంగం: మండల కేంద్రమైన సంగం గ్రామానికి చెందిన వంద మంది యువకులు శుక్రవారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి లాంఛనంగా పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా కోటేశ్వరరావు

కొండాపురం: మండల తహసీల్దార్‌గా కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏవీ సుందరమ్మ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావును తహసీల్దార్‌గా నియమించి పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్ర వారం తెలిపారు. 3న శైలపుత్రి, 4న బ్రహ్మచారిణి, 5న చంద్రఘంట, 6న కూష్మాండ దుర్గ, 7న స్కందమాత, 8న కాత్యాయిని, 9న కాళరాత్రి, 10న మహాగౌరి, 11న సిద్ధిధాత్రి 12న మానసాదేవి అలంకారం నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా 33 కేవీ విద్యుత్ లైన్‌ను మారుస్తున్నందున మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ఎంపీడీఓగా శ్రీనివాసులురెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కిషోర్‌బాబు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీఓకు సత్కారం



ఉదయగిరి: మండల ఎంపీడీఓగా పనిచేస్తూ ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన డీ ఈశ్వరమ్మను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఉపాధి, వెలుగు సిబ్బంది శాలువాలతో సత్కరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరాజు, తహసీల్దార్ సుభద్ర, ఏఓ రేణుక, ఎంఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఉపాధ్యాయ శిక్షణా తరగతులు

ఆత్మకూరు: స్టెప్ ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి మూడ్రోజుల పాటు ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాశంపై శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు స్టెప్ సమన్వయకర్తలు కోలా సుజాత, దమ్ము పద్మ శుక్రవారం తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులో జరిగే శిక్షణా తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి


మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఆత్మకూరు: పొదుపు మహిళలు చేతివృత్తులు, కుటీర పరిశ్రమల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మెప్మా బజార్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సొంతంగా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇకపై ప్రతినెలా 28,29 తేదీల్లో మెప్మా బజార్ నిర్వహిస్తామని తెలిపారు. పొదుపు మహిళలు తమ చేతివృత్తుల, కుటీర పరిశ్రమల ఉత్పత్తులను మెప్మాబజార్‌లో ప్రదర్శించి విక్రయించుకోవచ్చన్నారు. పట్టణ ప్రజలు పొదుపు మహిళల ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. మెప్మా సీఓ మాధవి, ఆర్పీలు, మున్సిపల్ ఏఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సీతారామపురం: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీరెడ్డి హెచ్చరించారు. మండలంలోని బసినేనిపల్లి, అయ్యవారిపల్లి సచివాలయాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరి వహించిన 9 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం దేవమ్మచెరువులోని డంపింగ్ యార్డును సందర్శించారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు మండలం చాకలికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. వింజమూరులో జరిగిన నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్‌లో సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన జీ లోకేష్, ఆర్ మణి, ఎస్ వైష్ణవి, డీ బాలవర్షిణి, ఎల్ లక్ష్మి, లీలావతి, జీ జగదీష్, వీ మధుతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి



మర్రిపాడు: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. డీసీపల్లి సచివాలయంలో గ్రామస్తులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఒకరికొకరు కలిసిమెలసి ఉండాలన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలు సాగిస్తుంటే తమకు సమాచారం అందజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు, డీసీపల్లి సర్పంచ్ సుప్రజా గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. మండలంలోని తూర్పుకొండారెడ్డిపల్లెలో 104 వైద్యసేవలను శుక్రవారం అందజేశారు. డాక్టర్ 37 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు



అల్లూరు: నగర పంచా యతీ కమిషనర్‌గా బీ ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న ఫణికుమార్ కావలి ఆర్వోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గుడివాడ ఆర్వోగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా నూతన కమిషనర్‌ను నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ సమీపంలోని పిల్లాపేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎవరైనా అనుమతి లేకుండా మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గా పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గంధ మహోత్సవం నేపథ్యంలో సర్పంచ్ తాజున్నీసాజిలానీ పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసి డ్రైనేజీల్లో పూడికతీయించడంతో పాటు రోడ్లను శుభ్రం చేయించారు.